# స్త్రీ



హరికిషన్

సాయంత్రం అయిదుగంటలు కావటానికి అయిదు నిమిషాలు మాత్రమే వ్యవధి ఉంది. ఫైల్సు మూతపడ్డయ్యి. సరంజామా బీరువాల్లోకి డ్రాయరు సొరుగుల్లోకి వెళ్ళింది. రోజంతా గడిచింది ఒక ఎత్తు. ప్రతిరోజూ ఈ అయిదు నిమిషాలూ గడవటం మరొకఎత్తు. కాని ఎత్తుకు పై ఎత్తు వేసేవాళ్ళు ఆ కంపెనీలో లేకపోలేదు.

గడియారం అయిదు కొట్టింది. ఆత్మవంచన చేసుకోలేని గడియారం కనుక సైనుకి అయిదు గంటలుకొట్టి తృప్తి పడింది. అందరికీ సంతృప్తి కలిగి కుర్చీల్లోనుంచి లేచారు. వచ్చేటప్పుడు అందరి గమ్యం ఒకటైనా, వెళ్ళేటప్పుడు ఎవరి గమ్యం వారిదే.

పరిమళ గృహోన్ముఖురాలైంది. ఇరవై గజాలు నడవగానే వెనకనుంచి పిలుపు. "ఏమండీ. పరిమళా"

ఆగి వెనక్కి చూసింది-సోమేశ్వర్.

"ఇంటికేనా?"

"అవును"

"పార్కుకు పోదాం రాకూడదూ!"

"సరేపదండి"

సోమేశ్వర్‌ను నాలుగుతో హెచ్చవేసినట్లైంది. పరిమళ సగమైంది.

పార్కులో ఒక చివర ఇద్దరూ కూర్చున్నారు.

"నా అర్జీ చూశారా!" అర్థించి అడగటంలో అప్యాయత ఉట్టి పడింది.

"మనస్సులో దాచుకున్నాను. ఖాళీ వచ్చినప్పుడు తప్పక ఉద్యోగం ఇస్తాను." నవ్వింది - ఆ నవ్వులో అతను మునిగాడు.

"ఇద్దరం నిన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాం. మనం భార్యాభర్తలైతే అంతా హర్షిస్తారు. అంతేకాదు. ఇద్దరం ఒకేచోట హాయిగా ఉంటాం"

"హాయి అనేది మాటల్లో ఉన్నంత ఉల్లాసంగా జీవితంలో ఉండదు సోమేశ్వర్. పెళ్ళికిముందున్న ప్రేమ. పెళ్ళయ్యాక ఉండదనటంలో ఆశ్చర్యం లేదు. అనుభవంకోసం అంగలార్చేవారు ప్రేమ అనే ముసుగు వేసుకొంటారు. ఈ ప్రేమ పెళ్ళిళ్ళల్లో నాకు నమ్మకంలేదు మామూలుగా పెద్దవాళ్ళు వెతికి చూసిన సంబంధాలు ఎన్నో రెట్లు నయం" నిర్ణయాన్ని నిష్కర్షగా చెప్పింది.

"నా ప్రేమలో నీకు నమ్మకంలేదు కదూ. నువ్వేమి చేయమన్నా చేస్తాను పరిమళా! నీకోసం నా ప్రాణం సైతం బలివ్వడానికి సిద్ధపడతాను" చేతిలో చెయ్యి వేశాడు.

"ఇంత వ్యక్తిత్వం లేనివాడు నాకు భర్తగా కావాలని నేను కోరుకోటంలేదు. నీకు తగిన పిల్లను పెళ్ళి చేసుకుని హాయిగా సుఖపడు సోమేశ్వర్!" వెళ్ళిపోటానికి సంసిద్ధురాలైంది. అతనూ లేచాడు. ఇద్దరూ వెళ్ళిపోయారు.

ఇంటికి వచ్చిన కూతుర్ని చూసి ఏమీ అనలేక పోయింది కాంతమ్మ.

"వంట్లో బాగాలేదామ్మా!"

"ఇరవై ఏళ్ళనాడే నన్ను ఏ కాలవలోనైనా తోసేస్తే ఎంతో బాగుండేదమ్మా, ఆ పని ఎందుకు

చేయలేదా? అని నీ మీద ఎంతో కసిగా ఉన్నాను. నేనే అంతపనీ చెయ్యటానికి నిశ్చయించుకున్నాను" కళ్ళు తుడుచుకుంటూ గదిలోకి వెళ్ళింది పరిమళ.

శాంతమ్మ మాట్లాడలేకపోయింది. పరిమళ విషయంలో తన నోరు ఎందుకు కట్టివేసుకోవాల్సి వచ్చిందో తనకు బాగా తెల్సు. అందుచేతనే ఆమె మాట్లాడలేకపోయింది.

రాత్రి ఎనిమిది గంటలైనా పరిమళ మాట్లాడలేదు.

"భోజనానికి రా పరిమళా!"

కూతురు చెయ్యిపుచ్చుకుని తల నిమురుతూ అన్నది శాంతమ్మ.

"అమ్మా, అందరికళ్ళూ నామీదనే ఉన్నాయ్యి. నన్ను ప్రేమించేవాళ్ళు ఆరోజుకారోజు ఎక్కువే అవుతున్నారు. నేను పెళ్ళిచేసుకుంటే ఒక వర్గం వారు జారుకుంటారు. 'ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను' అనేవారి నోళ్ళు మూతబడతై. ఇక నా అందాన్నిచూసి, వివాహిత స్త్రీని కనుక నన్ను కామించేవారు కొందరుంటారు. అటువంటివారికి తేలికగానే బుద్ధిచెప్పవచ్చు."

శాంతమ్మ విభ్రాంతురాలు కాలేదు. ఆవిడ కళ్ళు చెమ్మగిలినయ్యి.

"చదువుకున్నదానివి, ప్రాజ్ఞురాలివి. నీ ఇష్టం తల్లీ. కాని వరుడెవరు?" ఆదుర్దాగా అడిగిందావిడ.

'నాకు తగిన వరుడు ఎవరో నీకు తెలీదామ్మా. ఆ కనిపించని దేవుడే నా భర్త. ఈ మానవుల మీద నాకు నమ్మకం లేదమ్మా! నాన్న అదృష్టవంతుడు కనుకనే ఆయన దాటిపోయాడు. నువ్వు దురదృష్టవంతురాలివి కనుకనే, నేనుదాటిపోకుండా నువ్వు కంటికి రెప్పలా నన్ను కాపాడుతున్నావు."

శాంతమ్మ శాంతంగానే గదిలోనుంచి వెళ్ళింది.

* * * *

పదిహేను రోజులు శలవు పెట్టింది పరిమళ. శలవుకు కారణం శుభలేఖలే చెప్పాయి. ఆ ఊరు విశాఖపట్టణం. పెళ్ళి తిరుపతిలో.

'పరిమళా! నీ పెళ్ళికి అంతదూరం రాలేం. కనీసం రిసెప్షనైనా ఈ ఊళ్ళో ఇస్తావుకదా, అప్పుడే చూస్తాం మీ శ్రీవార్ని."

బాస్ దగ్గర్నుంచీ, ఆఫీస్ బోయ్‌వరకూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారందరూ. ఆమె చిరుమందహాసమే అందరికీ జవాబిచ్చింది.

పదిహేను రోజులు గడచాయి. పెళ్ళయి వచ్చిన పరిమళనుచూసి అందరూ అభినందించారు. ఒక్క సోమేశ్వర్ మాత్రమే సంతోషాన్ని ముఖానికి పులుముకున్నాడు.

"హనీమూన్‌కు వెళ్ళొచ్చారా" అన్నాడు.

"ఆహా, మద్రాసులో నాలుగురోజులూ. కొడైకెనాల్‌లో వారం రోజులూ ఉన్నాం."

'వెరీగుడ్.-జీవితం వడ్డించిన విస్తరిలానేఉన్నది. ఆయన ఏం చేస్తున్నారు. పార్టీ ఎప్పుడు?" అన్నాడు బాస్.

అందరూ బాస్ మాటను వంతపలికారు.

"క్షమించాలి, పెద్దపార్టీనే చేద్దామని అనుకున్నాం. వారికి ఢిల్లీలో ఉద్యోగం. డిఫెన్సు సర్వీసెస్‌లో. శలవులేక మద్రాసునుంచే ప్లేన్‌లో వెళ్ళిపోయారు. ఇవాళ సాయంత్రం హోటల్లో టీపార్టీ ఎరేంజ్ చేశాను. అందరం అయిదు గంటలకే వెళదాం".-ఎంతో సంతోషంగా చెప్పింది పరిమళ. అందరి సంతోషమూ సగమైంది. కారణం పరిమళ భర్తకూడా పార్టీలో పాల్గొనక పోవటమే.

ఆరోజు సాయంత్రం హోటల్లో టీపార్టీ పూర్తయింది. అందరూ అభినందించారు. "అయితే త్వరలోనే ఢిల్లీకి మకాం మారుస్తారనుకుంటాను" అన్నారొకరు.

"ఆహా, ఇల్లు దొరికాక వెళ్ళక తప్పదుకదా" మాటల్లో సిగ్గు తొణికిసలాడింది. అందం ఇనుమడించింది. అందరి అభినందనలూ స్వీకరించి బరువెక్కిన హృదయంతో ఇంటికి వెళ్ళింది పరిమళ.

ఇంటికి వెళ్ళగానే తల్లి అడిగింది. "టీపార్టీ అయిందా తల్లీ. అంతా ఏమన్నారు."

ఆవిడ మనస్సు విలవిల్లాడింది.

"నేను పెళ్ళిచేసుకుని గృహిణినైనందుకు అంతా ఎంతో సంతోషించారమ్మా. నీ అల్లుడిని

---

ఒక హాస్పిటల్‌లో కొంత కాలంగా వుంటున్న నర్సును పనినుంచి తీసివేశారు డాక్టర్!

ఒక పాతరోగివచ్చి "ఆ నర్సు కనిపించదేమండీ" అని అడిగారు.

"ఆవిడ ఒక్క చిరునవ్వుతోనే చాలా రోగాలు నయమౌతాయని చెపుతున్నారు. అయితే నా ప్రాక్టీస్ దెబ్బతింటుందేమోనని తీసేశాను" అన్నారు డాక్టర్.

"మరి యిప్పుడో!"

"చెప్పటానిక్కూడా ఎవ్వరూ రావటం లేదు."

---

చూడలేకపోయినందుకు అసంతృప్తి పడ్డారు."

ఆవిడకళ్ళు చెరువులే అయ్యాయి.

"ఏం చెప్పావు"

"నా అందం నిజం. నా జీవితం అబద్ధం. ఇంత అందంగా అబద్ధం ఆడగలిగినందుకు చాలా ఆనందంగా ఉన్నదమ్మా. నీ కూతురు అన్నీనేర్చిన నెరజాణమ్మా" మాటలో, చూపులో కసి. ప్రస్ఫుటంగా కనిపించింది. వెక్కివెక్కి ఏడ్చింది పరిమళ.

ఎట్లా ఓదార్చాలో ఆ తల్లికి అర్థంకాలేదు.

రాత్రిపదిగంటలైంది శాంతమ్మ నిద్రపోతున్నది. పరిమళకు నిద్రపట్టలేదు.

ఇరవై ఏళ్ళ జీవితమూ చర్విత చర్వణం చేసుకోసాగింది. మంగళసూత్రాలు చూసుకుంది. కళ్ళకు అద్దుకుని ముద్దుపెట్టుకుంది.

'స్త్రీ తనను తాను సంరక్షించుకోటానికి ఈ మంగళసూత్రాలు ఒక రకమైన ఆయుధమేమో! కాదు అందరికీ కాదు, నాకు మాత్రమే. పెళ్ళిచేసుకుని భర్తతో కాపురంచేస్తూ. బిడ్డా పాపల్ని ఎత్తుకుంటూ కలకాలం జీవించటానికీ. జీవించి సుఖించటానికీ. సంసార జీవితాన్ని సుఖప్రదం చేసుకోటానికి వివాహమైన ప్రతి భారతస్త్రీకి ఈ మంగళసూత్రాలు ప్రాణప్రదమైనవి. నాకు మాత్రం ఇవి నన్ను నేను రక్షించుకోవటానికి ఏర్పర్చుకున్న కవచాలు. అసలు నేనెందుకు పుట్టినట్లు? ఎవరినుద్ధరించాలి? ఎవర్ని సాధించాలి? ఏ కోరికల్ని జయించాలి? ఎవర్ని ఎంతకాలం వంచించి మోసగించాలి? ఎవరినైనా కొంత కాలం మోసగించవచ్చు. కొన్ని గంటలూ, రోజులూ మోసగించవచ్చు. నన్ను నేను నా జీవితాంతం మోసగించుకోవాల్సిందేకదా!" ఎంత ఆలోచించినా ఒక నిర్ణయానికి రాలేకపోయింది పరిమళ. చివరికి అనుకుంది. "నా జీవితం నా చేతుల్లోనేఉంది, నా ఆయుర్దాయం నా చేతుల్లో లేదు."

నెలగడిచింది. ఆ రోజున ఆఫీస్‌లో బాస్ లేరు. అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఢిల్లీనుంచి ఉత్తరాలొస్తున్నయ్యా" మేనేజరు అడిగాడు.

"వస్తున్నయ్యండీ. వారు కులాసాగానేఉన్నారు" అన్నది పరిమళ నవ్వు ముఖంతో.

"మీరు మేఘసందేశం చదివారా పరిమళా" అన్నాడు సోమేశ్వర్.

"కావ్య దృష్టితో చాలాకాలం క్రిందటే చదివాను. మీరు ఏ దృష్టితో అడిగారో నాకు తెలీదు"

సమాధానానికి నవ్వు జతపటంతో అతను కొంచెం బాధపడ్డాడు.

"సోమేశ్వర్ భగ్న ప్రేమికుడని కొంతమందికే తెల్సు." అన్నాడు మేనేజరు. గతుక్కుమన్నాడు సోమేశ్వర్. పకపక నవ్వింది పరిమళ.

"ఎంత గొప్పవారికయినా జీవితంలో అనుకున్నవీ, ఆశించినవీ సిద్ధించవు. కోర్కెలు సిద్ధించక పోవటంతో భగ్న ప్రేమికులనే బిరుదు తగిలించుకుంటారు. అంతేకదూ" అన్నది పరిమళ.

అంతా సోమేశ్వర్‌వైపు చూశారు. "భగ్న ప్రేమికులు ఎవరికి వారుగా కాలేదు. ఈ విషయాలు తెల్సిన వాళ్ళుకూడా ఇట్లా ఎందుకు మాట్లాడుతున్నారో అర్థంకావటంలేదు." అన్నాడు సోమేశ్వర్ విరక్తంగా.

అందరి మనసుల్లో ఏవో కొత్త ఆలోచనలు సరికొత్తగా జొరబడినయ్యి.

మరో నాలుగు రోజులు గడిచాయి. ఆరోజు ఆదివారం. ఉదయం తొమ్మిది గంటలైంది. అద్దంముందు కూర్చుని ఎవరో అంటున్నట్లుగా తనను తాను దూషించుకుంటున్నది పరిమళ.

తలుపు తట్టిన చప్పుడైంది. కళ్ళు తుడ్చుకుని తలుపు తీసింది. సోమేశ్వర్! "మీరా, రండి కూర్చోండి" ఆశ్చర్యపడింది. అతను కుర్చీలో కూర్చున్నాడు. "రండి." గదిలోకివెళ్ళింది పరిమళ. తల్లితో ఏదో చెప్పింది. మళ్ళీ వెంటనే గదిలోకి వచ్చి సోమేశ్వర్‌కు ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంది.

"ఏమిటి విశేషాలు" ముభావకంగానే అడిగింది.

"పరిమళా, ఆడపిల్లతో స్నేహమంటే ఏమిటో ఎరుగని నాతో స్నేహంచేశావు. నువ్వు స్నేహితునిగానే నన్ను చూసినా నేను అర్థంలేకుండా అనుకోకుండా మరికొంతదూరం వెళ్ళాను. నిన్ను ప్రేమిస్తున్నాననే విషయం నాకు నేను

నిర్ధారణ చేసుకుని నీతో చెప్పాను, పెళ్ళి చేసుకుంటానన్నాను. నువ్వు నాకు నచ్చలేదని ఒక్క ముక్క చెపితే ఇంత బాధపడేవాడిని కాదు. నువ్వు శ్రీమతివై, నా మనస్సులో చిచ్చుపెట్టావు పరిమళా చిచ్చుపెట్టావు. అసలు నన్నింతదూరం ఎందుకు తీసుకువచ్చావు పరిమళా" ఆవేశాన్ని వెనక్కినెట్టి అన్నాడు సోమేశ్వర్.

ఎడమ అరిచేతిలో రేఖల్ని చూసుకుంటూ పేలవంగా నవ్వింది పరిమళ.

"ఆడపిల్లకు ఉండవలసిన సిగ్గువున్నా, భిడియం మాత్రం నాకులేదు. ఈ కారణం చేతనే అందరితోనూ కలుపుగోలుతనంగా, సరదాగా మాట్లాడేదాన్ని, చదువుకునే రోజుల్లోనూ, ఇప్పుడూ అంతే. నా తత్వాన్ని కొంతమంది చనువుగా తీసుకున్నారు. వారి అభిప్రాయాలు. అవసరాలూ వెల్లడిచేశారు. తప్పించుకు తిరిగాను. జీవితంలో అందులో వయస్సులో ఉన్న ఆడపిల్ల ఏకాకిగా ఉండలేదు. ఉందామనుకున్నా కొంతమంది స్వార్థపరులు ఉండనివ్వరు. తల్లి ఉన్నా తండ్రిలేని నాకు అండకావాలి. అందుకే మీతో స్నేహం చేశాను. మీ స్నేహితురాలిని అయ్యాను. పార్కుకూ, పిక్నిక్, షికారుకూ, సినిమాకూ వచ్చాను. తెలియనివాళ్ళు భార్యాభర్తలమనుకున్నారు. తెల్సిన వాళ్ళు ప్రేమికులనుకున్నారు. మీ స్నేహంతో కొంత నీడ ఏర్పడింది. ఇదివరకు అకారణంగా పలకరించిన వాళ్ళు దూరంగా చూస్తూ వెళ్ళిపోయారు. అంతేకాదు. నేనూ ఏకాకిగా ఉండలేక పోయాను. మీ స్నేహాన్ని వాంఛించాను. అంతే. కాని ఎన్నడూ మిమ్మల్ని భర్తగా చేసుకోవాలను కోలేదు. నేను మీకు తగను. అంటే నేను పతితురాల్ని అని అర్థంకాదు. నా జీవితంలో నేను ఎన్నటికీ పతితురాల్నికాను, కాలేను. కాని మీ భార్యనై ఉంటే పెళ్ళి కాగానే మీరు నా శవాన్ని చూసేవారేమో!" ఇంక మాట్లాడలేక పోయింది పరిమళ. నిర్ఘాంతపోయి చూశాడు సోమేశ్వర్.

అయిదు నిమిషాలు ఎవ్వరూ మాట్లాడలేదు.

"పోనీలే పరిమళా, నా జీవితంలో నిన్ను మర్చిపోలేను, కాని జరిగిన సంఘటనలు మర్చిపోటానికి ప్రయత్నిస్తాను, నేనూ నిజంగా భగ్న ప్రేమికుడిని"

తలవంచుకొని కూర్చున్నాడు.

"నేను పరాధీనను సోమేశ్వర్, నీ గడ్డం పుచ్చుకుని నీ తలపైకెత్త లేను. నా వైపు చూసి మాట్లాడు."

తల పైకెత్తి చూశాడు. కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"ఛా. కన్నీరెందుకు సోమేశ్వర్, నా మాట యందు నీకు విలువ ఉంటే ఆ కన్నీటిని ఆనంద బాష్పాలుగానేగాదు, కన్నీటిని పన్నీరుగా మార్చాలి. నీవే నవ్వాలి, నవ్వు" తనూ పుట్టెడు దిగులును వెనక్కునెట్టి పేలవంగానే నవ్వింది. ఆ నవ్వులో తృప్తి కలిపాడు సోమేశ్వర్.

"నువ్వన్నట్లుగానే నీ జీవితంలో నన్ను మర్చిపోవద్దు. కాని జరిగిన సంఘటనలు మర్చిపోటానికి నువ్వు పెళ్ళి చేసుకోవాలి సోమేశ్వర్. అప్పుడు నీ భార్యకు ముఖ్య స్నేహితురాల్ని నేనే అవుతానేమో"

వంటగదిలోకి వెళ్ళి రెండు కప్పుల్తో కాఫీ తెచ్చింది.

"నీకు కాఫీ అంటే చాలా ఇష్టమని నాకుతెల్సు. పెళ్ళి చేసుకుంటావని కాఫీ తాగాకనే నాకు మాట ఇవ్వదుగాని."

ఇద్దరూ కాఫీ తాగారు.

"ఈ మధ్య అప్పుడప్పుడూ నన్ను మీరూ అంటున్నావ్ పరిమళా. అంతదూరం చేస్తున్నావేం"

"దూరంగా ఉన్నప్పుడే మనస్సులు దగ్గరవుతయి. అంచేతనే వారు ఢిల్లీలో ఉద్యోగం చేస్తుంటే నేను విశాఖపట్నంలో ఇట్లాగే ఉద్యోగం చేస్తూ ఉంటానని చెప్పాను. ఆయన ఒప్పుకున్నారు."

మనస్సు ఎటో వెళ్ళింది. మనిషి ఇక్కడ ఉంది. భావాలూ, ఆలోచనలూ లేవు. ఖాళీ బుర్ర అయింది. అతని ముఖంలోకి చూస్తూ కూర్చున్నది. మాటలేదు. అతనూ చూస్తూ కూర్చున్నాడు.

పదినిమిషాలైంది. మనస్సు మనస్సులో కలిసింది. వెక్కి ఎక్కువైంది. చిన్న పిల్లలా ఏడువ సాగింది.

"ఇంతలోనే అట్లా అయ్యావేం. ఆయన గుర్తు వచ్చారా పరిమళా, నిన్ను భార్యగా పొందిన వెంకటేశ్వరరావుగారు చాలా అదృష్టవంతులు. మాటల సందర్భంలో మర్చిపోయాను, ఆ అదృష్టవంతుని ఫొటో చూపిస్తావా పరిమళా"

వచ్చే దుఃఖాన్ని ఆపుకుంది. క్షణంసేపు కళ్ళు మూసుకుని కళ్ళు తుడ్చుకుంటూ ఒక్కసారి నిట్టూర్చి అన్నది.

"నాదిది అద్భుతరకం మనస్తత్వం. భార్యాభర్తలకు మనస్సు, మమత, హృదయానుగతమైన ప్రేమానురాగాలూ ప్రధానంగాని ఫోటోలూ, ఉత్తరాలూ ప్రధానం కాదంటాను. నేను ఎదురుగా ఉంటే ఒక్క క్షణం వదిలిఉండరు. ఇరవై నాలుగ్గంటలూ చాలవు. దూరంగా వుంటే అంతే. ఉత్తరాలు మమతల్ని మత్తెక్కించి పిచ్చివాళ్ళని చేస్తయ్యంటాను. అంచేతనే మా భార్యాభర్తల మధ్య నడిచే ప్రేమలేఖలుకావు. మూడు లైన్ల సాదా ఉత్తరాలు, వారి ప్రతి రూపం నా మనస్సులో హృదయంలో ఉన్నది. ఫొటోగా లేదు."

తనను తాను మనస్సులో నిందించుకుంటూ అన్నది పరిమళ.

"పోనీలే పరిమళా, మీ జీవితం అన్యోన్యానురాగాలతో మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వెళ్ళిపోతేచాలు, ఇంక వెళతాను."

సోమేశ్వర్ వెళ్ళిపోయాడు. పరిమళ అట్లాగే చూస్తూ కూర్చుంది.

ఆ రోజు రాత్రి తల్లితో అన్నది. "ఈ జీవితాన్ని నేను గడపలేనమ్మా. చెయ్యవలసిన మోసాలన్నీ చేశాను, ఆడవలసిన అబద్ధాలన్నీ ఆడాను. ఆనేది అబద్ధం చెప్పినా అందంగానే వుంటుందనే సామెత నా విషయంలో నిజమే అయిందమ్మా. ఇంక నేను అబద్ధాలు చెప్పలేను"

నిరాశ, నిస్పృహ పరిమళని పొదివి పట్టుకున్నాయి. ఈ నాడు ఆమె మనస్సు ఎంతో ఆక్రోశించింది. జీర్ణించిన ఆవేశం వెల్లుబికింది.

"ఏం చెయ్యదల్చుకున్నావో నువ్వేచెప్పమ్మా" అన్నది శాంతమ్మ.

"ఏ తప్పును నువ్వే కప్పిపుచ్చుకునేందుకు నన్ను ఎన్నో అబద్ధాలు ఆడించావమ్మా, కాదమ్మా కాదు. అది నీతప్పుకాదు, నాకర్మ. నా కర్మను నువ్వు పెంచి పోషించి దానికి ఇరవైయేళ్ళ వయస్సు వచ్చేటట్లు చేశావు. నాకు మైనారిటీ వెళ్ళింది. ఇంక నా బాధ్యత నేను చూసుకొంటాను. నీ సలహా నాకు అక్కర్లేదమ్మా అక్కర్లేదు." నోరు బాదుకుని అరచేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది పరిమళ.

తల్లి మాత్రం ఏం సమాధానం చెప్తుంది? ఏమీ చెప్పలేనని ఆమెకూ తెల్సు.

మరో నెల గడిచింది. పరిమళ ఆఫీసుకు వెళ్తున్నది. సోమేశ్వర్ ఆమెను పలకరించటంలేదు. గడ్డం పెరిగింది. చిక్కిపోయాడు. మనిషి వాలకమే మారిపోయింది.

ఇన్నిరోజులూ అంతా చూస్తునే ఉన్నది పరిమళ. అతను పిచ్చివాడై పోతున్నాడు. ఆమె మనస్సు బాధతో నిండిపోయింది. తన పరిస్థితికి కారణం భగవంతుడు. అతని పరిస్థితికి కారణం తాను. ఈ జీవితంలో భగవంతుడు తనను కాపాడలేదు. తన పరిస్థితి భగవంతుని చెయ్యిదాటి పోయింది. అతని పరిస్థితి తన చెయ్యిదాటి పోనివ్వకూడదు. అతన్ని కాపాడితే? అతని పాలిట తనే భగవంతుడు, తన పాలిట భగవంతుడు నిస్సహాయుడు.

నాలుగురోజులు గడిచాయి. ఆరోజు శనివారం, సాయంత్రం అయిదు గంటలయింది. సోమేశ్వర్ ఇంటికి వెళుతున్నాడు. మనిషిలానే కాదు. నడకలోనూ నిరాశ కనిపించింది.

"సోమేశ్వర్"

వెనక్కి తిరిగి చూశాడు. పరిమళ.

"ఈ ఉత్తరమూ డైరీ ఇస్తున్నాను. చదవండి ముందు డైరీ చదివి తరువాత ఉత్తరం చదవండి, అంతా ఊర్తయితే చదివితే, ఉదయమే మా ఇంటికి రావచ్చు." డైరీ, ఉత్తరం ఇచ్చింది. నిరాశా దాసుడైన అతను ఆగా వాటిని తీసుకున్నాడు. ఎవరిదారిని వాళ్ళు వెళ్ళారు.

ఆరోజు రాత్రి ఇద్దరూ నిద్రపోలేదు. పరిమళ తన మనస్సులోని ఆలోచనలను చదువుతోంది సోమేశ్వర్ ఆమె డైరీని చదువుతున్నాడు. రాత్రి పదకొండు దాటింది.

**20-12-64**

నాకు పదహారోఏడు వచ్చింది. స్కూల్ ఫైనల్ చదువుతున్నాను. పక్కింటి వాళ్ళతో అమ్మ ఏదో ఘర్షణ పడింది. ఆ రాత్రంతా అమ్మ ఏడ్చింది. కారణం నాకూ తెల్సు. కాని అందుకు నేను బాధ్యురాల్ని కాదు.

**29-12-64**

నా గురించి పక్కవాళ్ళు తెల్సుకున్నారు. నన్ను చూసి గుసగుసలాడుతూ ఏమిటో చెప్పుకున్నారు. నేనేంచేసేది?

1-1-65

[illegible]ర్చాను. నా ఖర్మ మారలేదు. అమ్మ విచారం ఎక్కువైంది.

31-3-65

[illegible] ఫైనల్ పరీక్షలయినయ్యి. డాక్టర్లు [illegible]. ఇంటికొచ్చి తల పగలకొట్టు కున్నాను, రక్తం కారింది. అమ్మ ఏడుస్తూ కట్టు కట్టింది. నా [illegible] అతివాళ్ళకు తెలిసింది. నేను [illegible] ప్రారంభించి రెండేళ్ళయింది. అవమానపు ముసిసిపోయే దాన్ని. కాని ముఖం ఆగటం లేదు.

1-5-65

గుంటూరు విడిచి దూరంగా విశాఖపట్నం వెళ్ళి పోదాం అన్నది అమ్మ. నేనూ సరే నన్నాను. ఊరు [illegible] ఖర్మ మారదు. ఖర్మ మారటానికి ఇంకో జన్మ ఎత్తాలి. కాని నిండు ప్రాణం ఎట్లా తీసుకోను

10-6-65

స్కూలు ఫైనలు ప్యాసయ్యాను బ్యాంకులో ఇరవై వేల రూపాయల డిపాజిట్లూ గడువై పోయి వచ్చింది.

11-6-65

గుంటూరుకు స్వస్తిచెప్పి విశాఖపట్నం చేరాము. డబ్బు బ్యాంకులో వేశాము. మహారాణీపేటలో ఇల్లు తీసుకున్నాము. జీవితం ఒక తీరాన సాఫీగా వెళ్ళిపోతుందనే ఆశ లీలగా కనిపించింది.

29-6-65

స్కూలు ఫైనల్ రిజల్టు వచ్చింది. నాలుగు వందల యాభై ఆరు మార్కులు వచ్చాయి. కాలేజిలో చేరుతానన్నాను. అమ్మ వద్దన్నది. ఏ కారణంచేత గుంటూరు వదిలామో ఆ కారణం చేతనే కాలేజిలో చేరితే ఈ విశాఖపట్టణంకూడా వదలాల్సి వస్తుందని విమర్శగా చెప్పింది అమ్మ. ఆ ప్రయత్నం మానుకున్నాను. ఆ రాత్రి నా ఏడుపుతో భళ్ళున తెల్లవారింది.

7-7-65

టైపు. షార్ట్‌హ్యాండ్ నేర్చుకోటానికి ఇన్ స్టిట్యూట్‌లో చేరాను. అమ్మ ఇల్లు కొంటానికి ప్రయత్నాలు చెయ్యసాగింది.

9-8-65

బ్యాంకులో ఉన్న డబ్బుతో పదిహేనువేలు పోసి ఒక చిన్న ఇల్లుకొన్నది అమ్మ. దూరదృష్టి లేకుండా నన్ను పెంచి పెద్దచేసిన అమ్మ నాకోసమే దూరదృష్టితో ఇల్లు కొన్నది. నాలుగ్గదుల చిన్న డాబా.

14-12-65

వయసొచ్చిన ఆడపిల్లల మాదిరి నేనూ సంచరించటం పూర్తిగా [illegible].

20-12-65

నాకు పదిహేడో ఏడు వచ్చింది. వయస్సుకు తగినట్లు ఎదిగిన నేవళంగా ఎదిగి చూడముచ్చటగా ఉన్నదని అమ్మలక్కలందరు నన్ను మెచ్చుకో సాగారు. ఎవరిఅభిప్రాయాలు వాళ్ళవి. నా పిచ్చి నాది. అమ్మకు దిగులు అలవాటైపోయింది

19-3-66

టైపు. షార్టుహ్యాండ్ పరీక్ష ఫీజులు కట్టాను. జీవితంలో రాణించలేకపోయినా, చదువులో రాణిం చగలనే ఆశ కలిగింది. కాదు. మిగిలింది.

21-5-66

టైపు లోయర్ పరీక్ష అయింది.

26-5-66

షార్టుహ్యాండ్ లోయర్ పరీక్ష అయింది.

9-6-66

ఎదురింటి వాళ్ళ ద్వారా నాకొక సంబంధం వచ్చింది. పిల్ల చాలా బావుంది. బుద్ధిమంతురాలు. కట్నం అక్కర్లేదన్నారు. మా పిల్లవానికి ఉద్యోగం చెయ్యాలని ఉన్నది. నాలుగేళ్ళు దాటాకనే పెళ్ళి ఆలోచన అని చెప్పింది అమ్మ. ఎంత చక్కగా ఇంత అబద్ధం ఆడింది అమ్మ. అతికే అబద్ధాలు చేదు నిజాలకన్నా ఎన్నో రెట్లు నయం.

---

విద్యార్థులలో [illegible] పెరుగుతున్న అశాంతికి విద్యాలయాలే కారణాలు కావచ్చునని వింటూన్న పెద్దమనిషి ఒక విద్యార్థిని కలుసుకుని "నీకు స్కూలు ఎలా వుంటే బాగుంటుంది?" అని అడిగాడు.

ఆ విద్యార్థి "మూసివుంటే బాగుంటుంది" అని సమాధానం చెప్పాడు.

---

14-6-66

అమ్మ డాక్టర్‌వద్దకు వెళదామన్నది. నా పరిస్థితి నాకు పూర్తిగా తెలుసు. అక్కర్లేదన్నాను.

29-7-66

రెండు పరీక్షలూ ప్యాసయ్యాను. టైపు హయ్యరుకూడా ప్యాసయితే ఏదైనా ఉద్యోగంలో చేరవచ్చునన్నది అమ్మ. సరేనన్నాను.

1-8-66

టైపు హయ్యరుకు వెళ్ళాలని నిశ్చయించు కున్నాను. ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను.

20-12-66

నాకు పద్దెనిమిదో ఏడు వచ్చింది. నిండుగా ఆ వయస్సు ఆడపిల్లలమాదిరే ఉన్నాను. కొంత మంది మగపిల్లలు నన్ను పలకరించ సాగారు. బిడియంలేకుండా మాట్లాడేదాన్ని. వాళ్ళ ఊహలు నాకు తెలుసు. నా పరిస్థితి నాకూ తెలుసు. కాలాను గుణ్యమైన భావాన్ని పెంపొందించుకోలేకదా

17-5-67

హయ్యర్ గ్రేడ్ టైపు పరీక్షకు వెళ్ళాను.

18-7-67

పరీక్ష ప్యాసయ్యాను. బ్యాంకులో డబ్బు చాలా అయిపోయింది. ఇంకో వెయ్యి రూపాయలు ఉన్నయ్యేమో. ఏదైనా ఉద్యోగం ప్రయత్నం చెయ్యమని అమ్మ ఎన్నో విధాల చెప్పింది. అదీ నిజమే. ఈ డబ్బు అయిపోతే రోజులు ఎట్లా వెళ్ళాలి?

29-8-67

ఫ్లవర్ ఏజన్సీస్ కంపెనీలో టైపిస్టు ఉద్యోగం ఖాళీ ఉందని తెలిసింది. అప్లికేషన్‌తో వెళ్ళాను. ఆ పోస్టులో ఇదివరకు ఆడపిల్లే ఉండి పెళ్ళి కావటంచే వెళ్ళిపోయిందని చెప్పారు. బాస్. మీరూ పెళ్ళికాగానే వెళ్ళిపోతారా అన్నారాయన. పెళ్ళిచేసు కున్నా ఉద్యోగం మాననని చెప్పాను. ఆయన నవ్వారు.

1-9-67

ఫ్లవర్ ఏజన్సీస్ కంపెనీలో టైపిస్టుగా చేరాను. జీతం నూటఅరవై.

2-9-67

ఆఫీసులో అందరూ నాతో కల్పించుకొని మాట్లా డారు. నేనొక్కర్తెనే ఆడపిల్లను. కాని అంద మైనదాన్నన్న గర్వం నాలో కొద్దిగా అంకురించింది.

4-9-67

అంతా నాతో మాట్లాడే వాళ్ళే.

26-9-67

ఆఫీసులో కొందరు మనస్సులు అర్థమైనయ్యి. మోహాన్ని మోహంతోనే జయించాలి. నేను ఆడపిల్లను కాను. వయస్సులో ఉన్న యువతిని. నన్ను నేను కాపాడుకోవాలి.

2-10-67

సోమేశ్వర్ చాలా మంచివాడు మర్యాదగా మాట్లాడేవాడు. నాకు అతను తోడుండటం ఎంతై యినా అవసరమేమో?

20-12-67

నాకు పంథొమ్మిదో ఏడు వచ్చింది. పరిపూర్ణతచెందిన "టీన్ గరల్"నని ఎంతో మెచ్చు కున్నాడు సోమేశ్వర్. బర్త్ డే కానుకగా వెండి టాయిలెట్ సెట్ ప్రెజెంట్ చేశాడు. ఒక నిశ్చయా నికి వచ్చాను. అతనితో స్నేహం నాకు సర్వదా వాంఛనీయమే. నా జీవితానికి అతని అండకావాలి.

2-2-68

సోమేశ్వర్‌తో బీచ్‌కి వెళ్ళాము. పాపం నన్ను ప్రేమిస్తున్నాడు. పెళ్ళాడితే?

9-2-68

అతనితో సినిమాకు వెళ్లాను. ప్రేమగా, ఆప్యా యంగా మాట్లాడాడు. నన్ను ప్రేమించాడట. పెళ్ళి చేసుకుంటానన్నాడు. నాకు పెళ్ళేమిటి? ఎందుకో నన్ను నేను చూసుకున్నాను. చావాలనిపించింది. కాని చావలేనేమో!

డైరీ పూర్తిగా చదివాడు. అతనికి కొంతవరకు అర్థమైంది. పూర్తిగా అర్థంకాలేదు ఉత్తరం వ్రాశాడు.

సోమేశ్వర్,

ఇదీ కథ, డైరీచదివినా నీకు అర్థంకాదు. నాకు మనస్సుంది. వయస్సుంది. వలపూ కోరికాఉన్నది. జీవిత భాగస్వామి కావాలని ఉన్నది. అందుకే నీతో స్నేహాన్ని పెంచుకొన్నాను. నీతో సినిమాలకూ, పిక్‌నిక్‌లకు, షికార్లకూ వచ్చాను. నీలో కోరికలుబలీయమైనాయి, నన్ను శాశ్వతంగా నీదాన్నిగా చేసుకోవాలనుకున్నావు. కాని మన స్నేహం ఇట్లా ఉండనే రానిస్తుంది. అంతేకాదు. ఇద్దరికీ మనశ్శాంతి ఉంటుంది. నాలోని లోటు నేను చెప్పలేను. అది నువ్వు తెల్సుకోవాలనుకుంటే నా శవాన్నే చూడాలేమో! నన్ను పెళ్ళి చేసుకోవాలనే నీ కోరిక నశించి పోవాలంటే నాకు పెళ్ళికావాలి. ఇంకో మార్గంలేదు. అందుకనే పదిహేను రోజులు శలవు పెట్టి తిరుపతి వెళ్ళి పెళ్ళి చేసుకున్నాను. వరుడు లేడు. ఆ మంగళసూత్రాలు నేను కట్టుకున్నవే! శ్రీవారు లేరు. ఢిల్లీలో ఉద్యోగంలేదు. శుభలేఖలు అచ్చుమాత్రం వేయించాను. అంతా పెద్ద అందమైన అబద్ధం. ఇదంతా స్త్రీగా నా ఉనికిని నిలుపుకోటానికే.

ఆరోజున మా ఇంటికి వచ్చావు. నచ్చచెప్పి పెళ్ళిచేసుకోమన్నావు. కాని ఫలితం శూన్యం. నువ్వు పిచ్చివాడివై పోతున్నావు. నేను పరాధీనమై పోయానని భగ్న ప్రేమికుడి వయావు, నా నుంచి నీ పరిస్థితి చెయ్యిజారిపోయింది. కానీ నా చెయ్యి జారిపోనివ్వదల్చుకోలేదు.

నేను ఆడపిల్లగా, స్త్రీగా, గృహిణిగా, నటించాను నటించటంకాదు. మగవాడిని మభ్యపెట్టాను, కాని నీ విషయంలో నా నటనవిఫలమైంది. ఇంక నటించలేను. ఒక్కకోరిక,ఈ ఉత్తరం,డైరీ నువుకావాలి. నువికావాలి. నా పుటక రహస్యం, జీవితరహస్యం లోకానికి తెలియకూడదు. ఆ భగవంతునికి తెలుసు. అమ్మకు తెలుసు. కడసారిగా నీకూ చెపుతున్నాను. నేను ఆడపుటక పుట్టాను. కాని స్త్రీత్వం లేదు. ఆడపిల్లనే కాని ఆడపిల్లనికాదు. సంసారజీవితానికి అయోగ్యురాలిని, తెలిసిందికదూ!

నా ఇరవైఏళ్ళ నాటకం నేటితో ముగిసింది! ఇంకనువ్వు పెళ్ళిచేసుకుంటే నా ఆత్మ శాంతిస్తుంది సోమేశ్వర్!

శ్రీ కాని శ్రీ.
పరిమళ.

ఉత్తరం చదివి నిర్ఘాంతపోయాడు సోమేశ్వర్. అప్పటికి రాత్రి పన్నెండుగంటలు దాటింది.

భళ్ళున తెల్లవారింది. ఉదయం ఆరుగంటలకే వాళ్ళింటికి వెళ్ళాడు. ఇంటిముందు జనం గుమికూడి ఉన్నారు.

పరిమళ శవం ప్రక్కన తల్లి స్పృహతప్పి పడి ఉంది...

★

# చర్చా వేదిక

# బూజు కట్టు గిరీశం!

ఏదో కాలక్షేపానికి మాత్రమే గాకుండా.రస పుష్టితోబాటు సంస్కరణాభిలాషతో సాహిత్య క్షీర మథనంలోంచి లోకాన ప్రమాదమయిన స్థాయిలో పరచుకున్న పాత సాంప్రదాయాలను, మూఢఆచారాలను విలువెల్ల భస్మం చేసేటంత తీవ్రమయిన వేడితో ఉద్భవించిన 'హాలాహల భాండమే'-'కన్యాశుల్కం' నాటకమని నా అభిప్రాయం.

సునిశితంగా పరిశీలిస్తే యీ పోలికలోని సత్యం అవగతమౌతుంది. అప్పట్లో అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కమే' భాష, భావమూ, సందేశము వంటి సాహిత్య పరిధుల్ని తెగనరికి విప్లవాత్మకమయిన 'నవ్యత'ని జోడించి ఎందరో మేధావుల్ని నాటికీ, నేటికీ ఆకర్షిస్తోంది.

'కన్యాశుల్కం' లోని పరిస్థితులు నేటి సమాజంలో కంచుకాగడాకి కూడ దొరకవ్. కానీ - అప్పటి పరిస్థితుల్ని కళ్ళకు గట్టినట్లు చూపుతూ చివికిపోయిన మన పాత బూర్జువాభావాలు, సంఘ మూఢాచారాలూ, వాటి విపరీత పరిణామాలు, యివన్నింటికీ దర్పణం పట్టింది 'కన్యాశుల్కం' నాటకం. ఇప్పటి తరం వాళ్ళకి ఆసక్తి కలిగిస్తున్న విషయం యిదే! మొహంజుదారో, హరప్పా - మన పురాతన ఔన్నత్యాన్ని ఎలా చారిత్రక సత్యంగా వెల్లడిచేస్తోందో, కన్యాశుల్కం కూడా అలాగే మన సనాతన సంప్రదాయాలలోని పతనావస్థని వేలెత్తి చూపింది.

'కన్యాశుల్కం' నాటకంలోని 'గిరీశం' పాత్ర విశిష్టమైనది. తన మాటలతో చేతలతో పాఠకులకూ, ప్రేక్షకులకూ ఎన్నో రీతులుగా అర్థమయే 'గిరీశం' నిజంగా ధన్యజీవి.

శ్రీ కె. వి. రమణారెడ్డిగారు 'గిరీశం' బండారాన్నంతా చమత్కారంగా బయటపెట్టేసారు! కొడవటిగంటి వారు గిరీశాన్ని, 'అప్పారావ్' సిడగా ఫొటో తీసి చూపారు. అందుకేవో ఉదాహరణలూ ఋజువులూ కూడ చూపించేరు! 'పార్కర్' సందేహం సబబుగా ఉంది. ఆయన కొడవటిగంటి వారి అభిప్రాయాలను ఖండించటం సహేతుకంగా ఉన్నది.

అయితే, నా దృష్టిలో - లేదా నేను గమనించే కోణంలోంచి "గిరీశం" మరో రీతిలో అగుపిస్తాడు నేను మొదటే చెప్పినట్లు అప్పారావ్‌గారి సృష్టి అయిన, లేదా అప్పారావు మానసపుత్రుడైన "గిరీశం" అప్పటి సాంఘిక దురాచారాలను మడిని మంటగలిపినట్లు కలపటానికని ఉద్దేశ్యంబడ్డాడు. వేరు విధంగా చెప్పాలంటే బూజుకర్రలాంటివాడు "గిరీశం".

మానవునిలో స్వార్థం బీజరూపాన్నివదలి మొలకెత్తిన తరుణంనుండే ధనలాలస అతన్ని పట్టిపీడిస్తోంది. "ఏదో విధంగా యింత సంపాయించి పడేస్తే నా తర్వాత వాళ్ళకు లోటుండదు" అనే భావనతో అర్జనని అన్యాయరీతులకు ఒప్పించటానికి కూడా సందేహించరు. అయితే యీ భావన ఒక్కటే కన్యాశుల్కానికి కారణమనను వరకట్నానిక్కూడా యిది వర్తించదు.

సూక్ష్మదృష్టితో ఆలోచిస్తే కన్యాశుల్కం వరకట్నంగా రూపుమార్చుకునేటందుకుగల పరిస్థితులు అవగతమవుతాయి. ఆ కాలంలో మగవాళ్ళ సంఖ్య హెచ్చుగా ఉండొచ్చనీ, ఆడవాళ్ళకొచ్చిన కరువు వల్ల కన్యాశుల్కాన్నిచ్చి మరీ స్వీకరించేవారనీ ఒక ప్రవాదు ఉంది. ఇపుడు ఆడవారి సంఖ్య జాస్తి అయిన కారణంగా "వరకట్నం" ఉద్భవించిందేమోననుకోవాల్సి వస్తుందపుడు!! హేతువాదంతో చూస్తే కొంతవరకిది నిజమేనేమోనని తోపకమానదు.

కానీ - అందరూ ఈ విషయానికి 'ఔ'నన లేరు. అనేకానేక కారణాల్లో అది ఒకటి కావొచ్చునేమోగానీ - కేవలం అదే కారణంకాదు! ప్రజామార్పుకోసం అబ్బులు చూస్తుంది. రోజు ఆయుష్షుకి నోచుకునే ఫాషన్లే యిందుకు మంచి ఉదాహరణ!

అలా కాలక్రమేణా రూపుమార్చుకునే 'వరకట్నం' అవతరించిందని నా ఉద్దేశ్యం. అయితే యీ సందర్భంలో 'వరకట్నం' గురించీ మాట్లాడటం అప్రస్తుతంకాదని నా మనవి ఎందుకంటే 'గురజాడ' వంటి మహాకవి ఆనాటి సమాజానికి వెన్నువిరిచినట్లున్న కన్యాశుల్కపు బూజుకోసం 'గిరీశం' అనే కట్టుని పటిష్ఠంగా చేశాడు. అయితే ఆ కట్టు అప్పారావ్‌నీ, ఆయన వ్యక్తి జీవితాన్నీ ప్రాతినిధ్యం వహిస్తుందో లేదో నన్నది మనకనవసరం. తప్పకూడానేమొ.

ఆ 'బూజుకట్టు' ఎంతవరకూ తన పనిలో కృతకృత్యురాలైందని ఆరాతీస్తే వచ్చే సమాధానం బోలెడు సంతృప్తి నిస్తుంది. ఒకనాడు - అంటే 'కన్యాశుల్కం' వెలుగులోకి వచ్చిన తొలి రోజుల్లో దాని ప్రభావం పెద్ద దుమారాన్ని లేవదీసిందని చాలామంది అన్నమాటలే!

చివరగా నేను చెప్పేదేమంటే 'గిరీశం' పాత్ర చాలా గొప్పది. బూజుకట్టుతో ఎన్నిమార్లు దులిపినా సాలీడు తన పని మాననట్లు - బూజు మళ్ళీ పడుతూనే ఉంటుంది. దాన్ని ఎప్పటికప్పుడు దులుపుతూనూ ఉండాలి. అటువంటి 'బూజుకట్టు' ఒకటి యీ 'వరకట్నా'న్నికూడా గట్టిగా దులపాలని నా ఆకాంక్ష. మరో గురజాడ కలంనుండి యింకో 'గిరీశం బూజుకట్టు' పుట్టాలి. ఆ 'డామిట్ కథ' మరోమారు అడ్డంతిరిగినా యిబ్బందిలేదు

— కాటూరి రవీంద్రత్రివిక్రమ్